## దసరా చీర్స్ @ 120 కోట్లు..

**ఆబ్కారీ శాఖకు పండుగ జోష్**

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో జోరుగా మద్యం విక్రయాలు**



సుబేదారి, అక్టోబర్ 17 : దసరా పండుగ ఆబ్కారీ శాఖకు కాసులు కురిపించింది. ఈ ఏడాది మద్యం విక్రయాలు మునుపటికంటే పెరిగాయి. పండుగకు రెండు రోజుల ముందు నుంచి మందుబాబులు మద్యం షాపుల వద్ద బారులు తీరారు. వైన్సులు, బార్లు కిటకిట లాడాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం రూ.120 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ శాఖ అధికారులు తెలిపారు. మొత్తం 294 వైన్స్, 60 బార్‌షాపుల్లో 5,01,883 బీర్ కేసులు, లిక్కర్ 2,64,553 కేసులు అమ్ముడు పోయినట్లు చెప్పారు.

## రెక్కల కష్టం మిగలడం లేదు..



నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశా. ఒక ఎకరాకు రూ. 32 వేల చొప్పున నాలుగు ఎకరాలకు రూ. 1.28 లక్షలు పెట్టుబడి పెట్టాను. గతంలో వరుసగా కురిసిన వర్షాలకు పూత, కాత రాలిపోయి ఎకరాకు 4 క్వింటాళ్లలోపు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. కూలీలకు డబ్బులు ఇవ్వడానికి పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చిన. క్వింటాల్‌కు రూ. 6,870 ధర పలికింది. రెక్కల కష్టం కూడా మిగులకుండా పోతున్నది. మద్దతు ధర కల్పించి మాలాంటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలె.

– గుగులోత్ జగన్, రైతు, అలంకానిపేట

# దిగుబడి రాకపాయె మద్దతు లేకపాయె..

**పత్తి రైతు దగా**

## ప్రతికూల పరిస్థితులతో పెరిగిన పెట్టుబడి భారం



కేసముద్రం మార్కెట్లో పత్తిని విక్రయించేందుకు బస్తాలపై కూర్చొని వ్యాపారుల కోసం ఎదురు చూస్తున్న రైతులు

**ఈసారి పత్తి రైతు పరిస్థితి దయనీయంగా మారింది. ఓ వైపు ప్రతికూల పరిస్థితులతో పూత, కాతపై ప్రభావం చూపి ఆశించిన దిగుబడి రాకపోగా మరోవైపు చేతికొచ్చిన అరకొర పంటకు 'మద్దతు' కరువైంది. భారీ వర్షాలతో ఇప్పటికే నష్టపోయి కుంగిపోతున్న రైతులను పెట్టుబడి భారం పెరగడం మరింత కలవరపెడుతున్నది. దీనికి తోడు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోగా ప్రైవేట్‌లో మాత్రం కొనుగోళ్లు జోరందుకున్నాయి. అలాగే వ్యాపారుల మాయాజాలంతో అక్కడా రైతుకు నష్టమే కలుగుతున్నది. అటు వరంగల్‌లోని ఎనుమాముల మార్కెట్‌లోనూ కొనుగోళ్లు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు ఏ ఒక్క రోజు కూడా ప్రభుత్వ మద్దతు ధర దక్కకపోవడంతో నిరాశే మిగులుతున్నది. గురువారం క్వింటా పత్తికి రూ.7,010 ఉండగా రోజురోజుకూ తగ్గుతూనే ఉంది. దీనికి తోడు మార్కెట్‌లో కనీస వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా అధికారుల పర్యవేక్షణా లోపం స్పష్టంగా కనిపిస్తున్నది.**

– వరంగల్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ)/కేసముద్రం



అమ్మేందుకు రైతులు ఎనుమాముల మార్కెట్‌కు తెచ్చిన పత్తి

### తేమ, తూకంలో మోసాలు

తేమ పేరుతో ధర తగ్గింపు.. తూకంలో మోసం వల్ల జనగామ జిల్లాలో పత్తి రైతు క్వింటాల్‌కు రూ.2వేల వరకు నష్టపోతున్నాడు. కాయకష్టం చేసి.. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పత్తి పంటను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయని ఫలితంగా అడిగిన ధరకు రైతు తెగనమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా 20 లక్షల టన్నుల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే పత్తి సేకరణ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా సీసీఐ జాడ లేకపోవడంతో గ్రామాల్లో కమీషన్ ఏజెంట్లు, పట్టణ కేంద్రాల్లో చిల్లర కాంటా వ్యాపారులు.. మిల్లుల యజమానులు రైతుల వద్ద పత్తిలో తేమ ఆధారంగా ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వరంగ సంస్థ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసే వరకు ప్రైవేట్ కొనుగోళ్లలో పత్తికి కనీస మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో నాణ్యత ఉన్నా వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. వర్షాలతో పత్తి రంగు మారడాన్ని ఆసరాగా చేసుకొని మిల్లుల్లో యజమానులు, బయట మధ్యవర్తులు మంచి పత్తికి కూడా సవాలక్ష కొర్రీలు పెట్టి ధర తగ్గించి కొంటున్నారు.

వాస్తవానికి 8 శాతం తేమ ఉంటే ఎ-గ్రేడ్ రకం పత్తిగా క్వింటాల్‌కు రూ.7,521, తేమ 9 నుంచి 12 శాతం ఉంటే ఒక్కో శాతానికి రూ.75 తక్కువకు కొనుగోలు చేయాలన్న నిబంధనలున్నాయి. ప్రైవేటు మిల్లుల్లో యజమానులు, ఏజెంట్లు, మధ్యవర్తులు మాత్రం రూ. 5,500 నుంచి రూ. 6,250 వరకు చేతిలో పెడుతున్నారు. దీంతో ఒక్కో రైతు రూ. 1000 నుంచి రూ. 1500 వరకు ధర నష్టపోతుండగా..ఇష్టారీతిలో సాగుతున్న తూకంలోనూ మోసపోతున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలు, తేమ శాతాన్ని సూచించే యంత్రాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో జిల్లాలో అటు మిల్లుల్లో, ఇటు చిల్లర కాంటాల వ్యాపారులు యథేచ్ఛగా రైతులను దోచుకుంటున్నారు. పత్తిలో నాణ్యత ప్రమాణాలు బాగానే ఉన్నా.. తేమ యంత్రాల్లో మాయాజాలంతో రైతన్న నెత్తిన టోపీ పెడుతున్నారు. గ్రామాల నుంచి వచ్చే వాహనాల డ్రైవర్లకు కమీషన్లు ముట్టజెప్పి రైతులు తెచ్చిన పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.



మహబూబాబాద్ జిల్లాలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంట

- భారీ వర్షాలతో పూత, కాతపై ప్రభావం
- ప్రారంభం కాని సీసీఐ కేంద్రాలు
- ప్రైవేట్‌లో జోరుగా కొనుగోళ్లు
- తేమ పేరుతో ధర తగ్గింపు.. తూకంలో మోసాలు
- క్వింటాల్‌కు రూ.2వేలు నష్టపోతున్న రైతులు
- అప్పుల ఊబిలో పత్తి రైతులు
- గతేడాదితో పోలిస్తే తగ్గిన సాగు విస్తీర్ణం
- చోద్యం చూస్తున్న అధికారులు
- మార్కెట్ యార్డుల్లో కొరవడిన వసతులు

### మానుకోటలో తగ్గిన సాగు విస్తీర్ణం

కొత్త పత్తి మార్కెట్‌కు వస్తున్నా సీసీఐ ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో కొనుగోలు విషయంలో ప్రైవేట్ వ్యాపారులది ఆడింది ఆట.. పాడింది 'పాట'గా మారింది. వారు చెప్పిన ధరకే పత్తి రైతు అమ్ముకోవాల్సి వస్తున్నది. మహబూబాబాద్ జిల్లాలో గతేడాది 84,980 ఎకరాల్లో పత్తి పంట సాగైంది. మార్కెట్‌లో ధర తగ్గడంతో ప్రభుత్వం క్వింటాల్‌కి రూ.7020 చొప్పున మద్దతు ధర అందించింది. ఈ ఏడాది 78,540 ఎకరాల్లో రైతులు పత్తి పంట వేయగా, ఆగస్టు చివరి, సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలతో పూత, కాత రాలిపోయి దిగుబడి పూర్తిగా తగ్గింది. చెట్టుకు అక్కడక్కడా ఉన్న కాయలు పగిలి పంట చేతికొచ్చే సమయంలో వరుసగా పడుతున్న వర్షానికి పత్తి రంగు మారుతున్నది. తీరా ఆ పత్తిని మార్కెట్‌కు తీసుకెళ్తే నాణ్యత లేదనే సాకుతో వ్యాపారులు ధర పూర్తిగా తగ్గిస్తున్నారు. మార్కెట్‌లో క్వింటాల్ పత్తి రూ.5 వేల నుంచి రూ.7వేల వరకు పలుకుతున్నది. ఎకరానికి 8-10 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి 2-3 క్వింటాళ్లే వస్తుండడం, మార్కెట్‌లో ధర పూర్తిగా తగ్గడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. రైతులకు రూ. 7,521 మద్దతు ధర కల్పించి ఆదుకోవాల్సిన సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నది. జిల్లాలోని కేసముద్రం మార్కెట్‌లో గురువారం పత్తి క్వింటాకు గరిష్ఠంగా రూ. 7,066, కనిష్ఠంగా రూ.6,659 ధర పలికింది.

**ఎకరానికి పెట్టుబడి ఇలా..**

రైతులు ఎకరం భూమిలో పత్తి సాగు చేసేందుకయ్యే ఖర్చు ఇలా ఉంది. మూడు సార్లు దుక్కి దున్నడానికి రూ.4500, అచ్చు వేసేందుకు రూ.1500, రెండు విత్తన ప్యాకెట్లకు రూ.1700, విత్తడానికి కూలీ రూ.900, గొర్రు తోలేందుకు రూ.6వేలు, కలుపు తీసేందుకు రూ.5వేలు, మందులకు రూ.2 వేలు, ఎరువుల బస్తాలకు రూ.4వేలు, మందుల పిచికారీకి రూ.5 వేలు, ఎకరం పత్తి ఏరేందుకు రూ.4,500 మొత్తం సుమారుగా రూ. 35,100 ఖర్చవుతున్నది. అయితే ప్రస్తుతం ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నది. క్వింటాకు రూ.7 వేల చొప్పున రూ.21వేల నుంచి రూ.28 వేలు వస్తున్నాయి. పత్తికి మద్దతు ధర చెల్లించినా రైతులకు పెట్టుబడి వచ్చే అవకాశం లేదు. దీంతో వారు అప్పుల్లో కూరుకుపోతున్నారు.

### ఒకే లాట్ వద్ద జెండాపాట



ఎనుమాముల మార్కెట్‌లో ధర నిర్ణయానికి జెండాపాట

ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్లలో రెండోదైన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఈ ఏడాది కొత్త పత్తికి ఒకరోజూ కూడా మద్దతు ధర దక్కలేదు. గతేడాది అక్టోబర్ 16 వరకు ఈ మార్కెట్‌లో రైతులు 22,104 క్వింటాళ్ల పత్తి అమ్మారు. అప్పట్లో క్వింటా పత్తికి ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020 ఉండగా, దానికంటే ఎక్కువగా గరిష్ఠంగా రూ. 7,070 దక్కింది. ఈ ఏడాది బుధవారం వరకు రైతులు 22,088 క్వింటాళ్ల పత్తి విక్రయించారు. ఇప్పటి వరకు ఇక్కడ గరిష్ఠ ధర క్వింటాకు రూ.7,500 మాత్రమే దక్కింది. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ. 7,521. గురువారం ఒకే లాట్ వద్ద మార్కెట్ అధికారులు జెండా పాట నిర్వహించగా వ్యాపారులు గరిష్ఠ ధర రూ.7,010 వరకు పాడి ఆగారు. దీని ఆధారంగా ఇతర లాట్ల వద్ద వేలం పాట లేకుండానే ధర నిర్ణయించారు. బుధవారం గరిష్ఠ ధర రూ.7,060 ఉండగా, గురువారం రూ.7,010కి తగ్గింది.

### పేరుకే జెండాపాట



పత్తి పంట సాగులో ఈ ఏడాది నష్టాలే. మొదట్లో విత్తనాలు సరిగా మొలువలె. అప్పుడేమో వానలు పడలే. తర్వాత అధిక వర్షాల వల్ల పంట ఏపుగా పెరగలె. పూత కాత తగ్గడం వల్ల దిగుబడి సగానికి పడిపోయింది. గతంలో ఒక ఎకరం పత్తి పంటలో ఆరుగురెడుగురు కూలీలు పత్తి ఏరితే ఇప్పుడు వానలతో తడవడం వల్ల పది మంది పనిచేయాల్సి వస్తున్నది. ఇలా పెట్టుబడి భారం పెరిగింది. తీరా అమ్మేందుకు మార్కెట్‌కు తెస్తే ఏదో ఒక లాటు వద్ద జెండాపాటతో గరిష్ఠ ధర నిర్ణయించి మిగతా లాట్లన్నింటికి వ్యాపారులు తమ ఇష్టమొచ్చిన రేటు నిర్ణయిస్తున్నరు. పేరుకే జెండాపాట. గరిష్ఠ ధరపై ఇతర లాట్లన్నింటికి రూ. వెయ్యి వరకు రేటు తగ్గించి కొంటున్నరు.

– కొత్త వినయ్, రైతు, పెద్దాపూర్, ఆత్మకూరు

### ప్రైవేటు మిల్లుల్లో పత్తి విక్రయాలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇప్పటికీ సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. దీంతో రైతులు ప్రైవేట్ పత్తి మిల్లులకు తీసుకెళ్లి విక్రయించుకుంటున్నారు. జిల్లాలోని కాటారం సెంటర్‌లో రుద్ర, మీనాక్షి కాటన్ మిల్లులు, చిట్యాల సెంటర్‌లో ఆంజనేయ, శ్రీ బాలమురుగన్ కాటన్ మిల్లులు, భూపాలపల్లి సెంటర్‌లో ఎంఎస్‌ఆర్ కాటన్ మిల్లులకు అధికారులు సీసీఐ కొనుగోలు కేంద్రాలుగా అనుమతి ఇవ్వగా ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభించలేదు. జిల్లాలో వరి తర్వాత రైతులు ఎక్కువగా పత్తి సాగు చేస్తారు. వానకాలంలో జిల్లాలో 91,581 హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేయగా ఇటీవలి వర్షాలకు పంట బాగా దెబ్బతిన్నది. సీసీఐ కేంద్రాలు మొదలుకాకపోవడంతో ప్రైవేటు మిల్లుల్లో దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతున్నది. ఒక్కో మిల్లులో ఒక్కో రేటుతో (రూ. 6 వేల నుంచి రూ. 7 వేలు) వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జిల్లాలో భూపాలపల్లి, చిట్యాలకు ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ యార్డులను మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. కాటారంలో ఉన్న మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు చేయడం లేదు.



ప్రారంభానికి నోచుకోని చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు

### ఎనుమాముల మార్కెట్‌లో కొరవడిన వసతులు

ఎనుమాముల మార్కెట్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రూ.55 కోట్ల ఆదాయం సేకరించేందుకు ప్రభుత్వం నిర్దేశించింది. అయితే ఇక్కడి యార్డుల్లో తాగునీరు అందుబాటులో లేదు. పరిశుభ్రత కొరవడింది. టాయిలెట్స్ నిర్వహణ లోపించింది. మహిళా రైతులకు ప్రత్యేక ఏర్పాట్లు లేవు. రైతుల పంట ఉత్పత్తులకు భద్రత కరువైంది. ప్రస్తుతం మార్కెట్‌లో కొన్నిచోట్ల సీసీ కెమెరాలున్నా నిర్వహణ లేక పనిచేయడం లేదు. రైతుల విశ్రాంతి భవనం నిర్వహణ అటకెక్కింది. వీటికితోడు ఇంటర్నెట్ సమస్యతో తూకం మిషన్లు సరిగా పనిచేయడం లేదు. జిల్లాలో 14 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా ఒక్కటీ ప్రారంభం కాలేదు.



కొమ్ములవంచలో ఆరబెట్టిన పత్తి

### పత్తి చేను తీసేస్తున్నా..



నాకున్న 1.10 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. అకాల వర్షాలు, వాతావరణం అనుకూలించక ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం లేదు. డిసెంబర్ వరకు కాయాల్సిన పత్తి పూత, కాత లేకపోవడంతో ఈ నెలలోనే తీసేస్తున్నా. దిగుబడి లేక.. ధర రాక.. పెట్టిన పెట్టుబడి ఎల్లక అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చింది. రైతులకు పెట్టుబడి సాయం ప్రభుత్వం అందించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.ప్రభుత్వం ఇప్పటికైనా మద్దతు ధర వచ్చేలా చూడాలి.

–మల్లయ్య, రైతు, కల్వల

## గ్రూపు రాజకీయాలు చేస్తే పొలిమేర దాటనివ్వం

- ఎమ్మెల్యేపై ఫిర్యాదుకు అవసరమైతే ఢిల్లీ వెళ్తాం
- కాంగ్రెస్‌లో ఇందిరమ్మ కమిటీల చిచ్చు
- సీనియర్లను విస్మరించారని నాయకుల కస్సుబుస్సు
- ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మురళీనాయక్‌కు తాకిన సెగ



నెల్లికుదురు : మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదవరెడ్డి, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మండలాధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్

నెల్లికుదురు/జఫర్‌గఢ్/బయ్యారం, అక్టోబర్ 17: కాంగ్రెస్‌లో ఇందిరమ్మ కమిటీలు చిచ్చురేపుతున్నాయి. సీనియర్లను విస్మరించారని నాయకులు కస్సుబుస్సులాడుతున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మురళీనాయక్‌ను సొంత పార్టీ నేతలే తప్పుపడుతున్నారు. ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో తమను విస్మరించడాన్ని నిరసిస్తూ నెల్లికుదురు మండల కేంద్రంలో గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, మాజీ జడ్పీటీసీ హెచ్ వెంకటేశ్వర్లు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్‌గౌడ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో ఎవరికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యే ఉన్నారని అన్నారు. ఇండ్లలో కూర్చొని ఇందిరమ్మ కమిటీలు వేయడం దారుణమన్నారు. పార్టీకి ద్రోహం చేసే చర్యలకు పాల్పడితే అవసరమైతే ఢిల్లీకి వెళ్లయినా ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేస్తామన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీనియర్లను విస్మరించి, నిన్న, మొన్న వచ్చిన వారికే చోటు కల్పించారని ఆరోపిస్తూ, ఆయన వైఖరికి నిరసనగా కాంగ్రెస్ నాయకులు జఫర్‌గఢ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి గురువారం వినతి పత్రం ఇచ్చారు.

మాజీ జడ్పీటీసీ పట్టపురి సదయ్య గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ శ్రేణులకు నామినేటెడ్ పోస్టులు, ఇందిరమ్మ కమిటీల్లో చోటు కల్పిస్తూ అసలైన కాంగ్రెస్ వాదులను పక్కన పెడుతున్నాడని అన్నారు. కడియం తీరు మార్చుకోకపోతే ఆమరణ దీక్షకు కూడా సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ తాటికాయల శరత్‌బాబు, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి రడపాక రాజ్‌కుమార్, మండల సీనియర్ నాయకులు బానోత్ లచ్చి రాంనాయక్, బానోత్ భిక్షపతినాయక్, ఓరుగంటి రాజు, కైరిక మల్లయ్య, జఫర్‌గఢ్ మాజీ ఉపసర్పంచ్ నంచర్ల లత, తిరుపతి, మర్రి రమేశ్, ఉల్లి శివరాజ్, కుక్కల ఎల్లయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు సుమన్, రాజు, రాజేందర్, భాస్కర్, అఖిల్, బాబు, ఎల్లయ్య, నర్సయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బయ్యారం మేజర్ గ్రామపంచాయతీకి సంబంధించిన ఇందిరమ్మ కమిటీలో మహిళా సభ్యుల పేర్లను తనకు సమాచారం లేకుండా ఎంపిక చేశారని కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు తగిరనిర్మలారెడ్డి ఆరోపించారు. ఆధిపత్యం కోసం ఆడబిడ్డలను అవమానిస్తున్నారని పేర్కొన్నారు. అందరి సమక్షంలోనే కమిటీ సభ్యుల పేర్లు నిర్ణయించాలని, లేకుంటే రాబోయే స్థానిక ఎన్నికల్లో వారికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

## కన్వర్షన్ చేయకుంటే పోరాటమే..

**ఎన్పీడీసీఎల్ భవన్ ఎదుట ఆర్టిజన్ల ధర్నా**




హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి ఎన్పీడీసీఎల్ భవన్‌కు ర్యాలీగా వస్తున్న ఆర్టిజన్స్

హనుమకొండ, అక్టోబర్ 17: ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాల్సిందేనని గురువారం హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ నుంచి నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్(టీవీఏసీ)జాక్ పిలుపు మేరకు 16 సర్కిళ్ల (ఐదు ఉమ్మడి జిల్లాల పరిధి) నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివచ్చారు. ఆర్టిజన్స్ వద్దు.. కన్వర్షన్ ముద్దు, ఆర్టిజన్స్ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి, జేఏసీ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు జేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 23,667 మంది కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్లుగా కన్వర్షన్ చేసిందని, ప్రస్తుతం 19,857 మంది ఉన్నారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కన్వర్షన్ ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత ప్రకారం జేఎల్, సబ్ ఇంజినీర్లు, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్‌గా కన్వర్షన్ చేయాలన్నారు. విరమణ ఆర్టిజన్స్‌కు కేవలం రూ. 80వేలు, రూ. 84వేల వరకు మాత్రమే వస్తున్నాయని, 20 నుంచి 25 సంవత్సరాల సర్వీసు చేసిన కార్మికులకు అంత చిన్న మొత్తం బెనిఫిట్స్ రావడం బాధాకరమన్నారు. తాజాగా ప్రభుత్వం 3,500 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించిందని, తమ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు రిక్రూట్‌మెంట్ చేయొద్దని, ఒకవేళ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను ప్రారంభిస్తే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఆలోచించి తమ కుటుంబాలకు న్యాయం చేయాలని, లేకపోతే సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అనంతరం సీఎండీ వరుణ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ఎంఏ వజీర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, కో కన్వీనర్ నాగరాజు, అరవింద్, కో చైర్మన్ శంకర్, ఫైనాన్స్ సెక్రటరీ సదానందం, జాయింట్ సెక్రటరీ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## లక్నేపల్లి ఆంగ్ల ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం

**ఎన్సీఈఆర్టీకి ఎంపికైన డాక్టర్ సత్యం ప్రాజెక్ట్**



ఆంగ్ల ఉపాధ్యాయుడు డాక్టర్ శంకరభక్తుల సత్యం

నర్సంపేట రూరల్, అక్టోబర్ 17 : వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు డాక్టర్ శంకరభక్తుల సత్యంకు అరుదైన గౌరవం లభించింది. ఆయన రూపొందించిన ప్రాజెక్టు ఆధారిత బోధన పద్ధతి న్యూఢిల్లీలోని జాతీయ విద్యాపరిశోధన శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ)కి ఎంపికైంది. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డీఎస్‌వీఎన్ మాధురి విలేకరులకు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా వచ్చిన ప్రాజెక్టుల నుంచి ఉన్నత పాఠశాలల విభాగంలో 'అకడమిక్ అచీవ్‌మెంట్ అండ్ ప్రొఫెషియన్సీ ఇన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ డిస్‌కోర్సెస్' అనే ప్రాజెక్టును ఎన్సీఈఆర్టీ విద్యా విభాగం రెండు దశల్లో ఎంపిక చేసిందన్నారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించేందుకు వారానికి రెండు లేదా మూడు ప్రత్యేక తరగతుల్లో ప్రాజెక్టు ఆధారిత బోధన చేయాల్సి ఉంటుందన్నారు. బోధన అంశాల రిపోర్ట్స్‌ను న్యూఢిల్లీలోని ఎన్సీఈఆర్టీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ (డీటీఈ) విభాగం పరిశీలన కోసం పంపించినట్లు వివరించారు. 2019-20 విద్యా సంవత్సరంలో సత్యం రూపొందించి, బోధించిన 'ది యూజ్ ఆఫ్ ఐసీటీ ఇన్ ఈఎల్‌టీ' ప్రాజెక్టుకు అంతర్జాతీయ సంస్థ యునెస్కో నుంచి ప్రశంసలు లభించాయని మాధురి తెలిపారు. ఈ సందర్భంగా సత్యంను హెచ్‌ఎంతో పాటు తోటి ఉపాధ్యాయులు అభినందించారు.